


ఆ రోజు ఆదివారం. డాక్టరు పద్మావతి తీరిగ్గా వున్నారు. హాస్పిటల్‌కు వెళ్ళనక్కర్లేదు. ఏదో జర్నలు తిరగేస్తూ విశ్రాంతిగా కూర్చున్నారు. అంతలో ఆవిడ అసిస్టెంట్లు, హౌస్సర్జన్లు అంతా నలుగురు బిలబిల్లాడుతూ వచ్చారు.

"రండి, రండి, ఏమిటి విశేషం? కూర్చోండి!" అంటూ ఆహ్వానించారు. ఆవిడ పని విషయంలో ఎంత స్ట్రిక్టుగా వుంటారో తనతోటి వారితో— ముఖ్యంగా తన యూనిట్‌లో పనిచేసే వారితో అంత చనువుగా స్నేహంగా వుంటారు.

"అబ్బే ఏంలేదండీ. వూరికే మిమ్మల్ని చూడకుండా ఇంటికి వెళ్ళబుద్ధి అవలేదు. అంచేత ఇలా వచ్చాము" అంది డాక్టరు రమ.

ఆవిడ నవ్వుతూ హాస్పిటల్ కబుర్లు అడగడం మొదలుపెట్టారు. ఇక లాభం లేదకుకొని కాస్త చొరవగల రమే అడిగింది.

"మాడమ్ మీతో కబుర్లు చెప్పుకొని చాలా రోజులయింది. ఏవన్నా మీ అనుభవాలు చెప్పండి వింటాం."

ఇలా వాళ్ళడగడం, ఈవిడ చెప్పడం మామూలే. ఆవిడ తన అనుభవాలకు మరి కాస్త రంగులుదిద్ది చెప్తూవుంటే శ్రోతలు మంత్రముగ్ధుల్లా వింటారు. ఉద్యోగరీత్యానే కాకుండా సరదాకొద్దీ దేశంలో నాలుగు మూలలూ చూశారు. విదేశాల్లో పోస్టుగ్రాడ్యుయేటు డిగ్రీ పుచ్చుకున్నారు. అందులోను కొస్త సున్నితమైన మనస్సు కలదేమో ఇక అనుభవాలకు కొరవలేదు.

"ఇప్పుడేం కథల్రా చెప్పి చెప్పి నాకు వినుగేస్తూంది కాని మీకు వినుగు లేనట్లుంది' అని అన్నారు.

కాని చెప్పడం ఆవిడకూ సరదాయే. అందులో వచ్చిన వాళ్ళు ఎలాగూ వదలరు. కాస్సేపు ఏదో ఆలోచనలో మునిగిపోయారు. మారుతున్న ఆవిడ ముఖకవళికలను గమనిస్తూ అందరూ నిశ్శబ్దంగా వుండిపోయారు. కానీ ఎవరికి వారు ఇంత సన్నటి మనిషిలో అంత విజ్ఞానం, అంతటి మంచితనం ఎక్కడ దాగి ఉన్నాయా అని ఆశ్చర్యపోతూ వుండిపోయారు.

"సరే వినండి. మధ్యలో ప్రశ్నలు వేయకండి. అంతా విన్నాక అప్పుడు అడగండి" అంటూ మొదలుపెట్టారు:

'అవి నేను డిగ్రీ పుచ్చుకున్న కొత్త రోజులు. ఉద్యోగం వచ్చింది. ప్రైవేటు ప్రాక్టీసు పెట్టు, లేదా మన వూళ్లోనన్నా

పోస్టింగు వేయించుకో' అన్న నాన్నగారి మాటను, 'పెళ్ళి చేసుకో' అనే అమ్మ మాటను సునాయాసంగా త్రోసి రాజని ఏదో మారుమూల పోస్టింగు వేయించుకున్నా. అప్పుడు కళ్ళముందు నిలిచింది ఆదర్శం మటుకే. 'నా దేశం, పల్లెటూర్లలో నాకోసం నా వైద్యం కోసం చేతులుచాచి ప్రార్థిస్తున్న అమాయక గ్రామీణులు, దేశసేవ, మానవ సేవ ఇవే అప్పటి ఆదర్శాలు. రక్తం చాలా వేడిగా, వేగంగావున్న రోజులవి. అందుకే నాన్నగారితో హోరాహోరీగా యుద్ధంచేసి, వార్ని ఒప్పించి వంటమనిషితో, కొద్ది సామానుతో పల్లెటూరికి ఉద్యోగంకోసం వెళ్ళిపోయాను. ఆ వూరు చాలా చిన్నది. మెయిల్ ఒక్క నిమిషంఆగుతుంది-అక్కడ నుంచి బస్తీ చాలా దూరం. నేను కోరు కున్నది ఇటువంటి వాతావరణమే కనుక ఇట్టే యిమిడిపోగలిగాను.

ఇక హాస్పిటల్ కూడా చాలా చిన్నదే. స్టాఫ్ అంతా కలిపి పన్నెండుమంది కన్నా ఎక్కువ వుండేవారు కారు. అయినా చెయ్యాలనుకున్నవారికి కావలసినంత పని వుండేది. పని అంటే విసుగ్గాని, అలుపుగాని నేను ఎన్నడూ ఎరుగనుగనుక నాకు సులువుగా వుండేది. రకరకాల మనుష్యులు, రకరకాల మనస్తత్వాలు. కొన్ని కళ్ళల్లో ఆరాధన, కొన్ని కళ్ళల్లో భయం. కొన్ని కళ్ళల్లో వ్యంగ్యం, కొన్ని కళ్ళల్లో నిరసన ఇలా వుండేది. ప్రతి అనుభూతిని నేను తేలిగ్గా తీసుకుని నవ్వుకుని పెద్ద రిలీఫ్ పొందేదాన్ని. కానీ త్వరలో ఈ పల్లీయులు నేను అనుకున్నంత అమాయకులు కారుసుమా అని గ్రహించగలిగాను.

గ్రామంలో దాదాపు అంతా రైతాంగమే. మిగిలిన కొద్దిమంది వృత్తి వ్యాపారస్థులు. రైతుల్లో సగానికిపైగా నాయుడుగారి భూములు సాగుచేసేవారే. నాయుడుగారు చుట్టుప్రక్కల గ్రామాలన్నిటికీ మకుటంలేని మహారాజు వంటివాడు. జమీందారీ లేదుకానీ అంతటి దర్జాగా మటుకు వుండేవారు. సాలుకు ఆదాయం దాదాపు రెండు లకారాలు దాటుతుందట. ఇక స్థిరచరాస్థుల లెక్క ఎవరికీ తెలియదు. నేను అక్కడకు వెళ్ళకముందే నాయుడుగారు చనిపోయారుట. ప్రస్తుతం అంత పెద్ద భవనంలో ఆయనగారి ఏకైక సంతానం రమాదేవి, అల్లుడు రామానుజం, తమ్ముడు సుదర్శనం. అతని కుటుంబం అంతా కలిపి ఏడెనిమిది మంది వుండేవారు. ఇకపోతే పనివాళ్ళు, గుమాస్తాలు వుండేవారు. నాకు ఈ ఇన్ఫర్మేషనంతా మా వంటావిడ చెప్తుండేది.

హాస్పిటల్‌కు మటుకు వాళ్ళ కుటుంబ సభ్యులెవరూ వచ్చేవారు కాదు. నాయుడిగారి గుమాస్తాలమనీ, పనివాళ్ళమనీ వస్తూ వుండేవారు.

అలా నాలుగయిదు నెలలు గడచిపోయాయి. నాకు ప్రత్యేకమైన స్థానం, గౌరవం, ఆప్యాయత ఆ గ్రామీణులు కల్పించారు.

ఒకనాడు వున్నట్లుండి నలుగురు గుమాస్తాలు, ఒక పల్లకి బోయీలు, హాస్పిటలుకు వచ్చారు నాయుడు గారింటికి దయ చేయమంటూ. ఇళ్ళకు వెళ్ళడం నా కిష్టం లేదు. కానీ ఏకధారగా ఏడుస్తున్న ఆ పరిచారిక ముఖంచూసి కాదనలేక ఒప్పుకున్నాను. పల్లకీ వద్దని పంపేసి ఏవో కొద్ది మందులు తీసుకొని నడిచే వాళ్ళిల్లు చేరుకున్నాను.

మేడమీదకు తీసుకువెళ్ళారు. రమాదేవి యమయాతనపడుతూ మంచంమీద పడి వుంది. అంతటి బాధలోవున్నా ఆవిడ అందం నన్ను ముగ్ధురాల్ని చేసింది. ఎంత ప్రయత్నించినా అబార్షను ఆపలేకపోయాను. స్పృహలేకుండా పడివున్న రమాదేవిని వదలి రాలేక ఆ రాత్రంతా అక్కడే వుండి తెల్లవారి బయలుదేరాను. రమాదేవి కాస్త తేలిగ్గా కనిపించింది. బలహీనంగా వున్న చేతుల్ని ఎత్తి దీనంగా నా కళ్ళల్లోకి చూస్తూ నమస్కరించింది. ఆ చూపు నన్నెంతగానో కదిలించింది. దీనమైన ఆ విశాల నేత్రాలు నన్ను చాలా రోజులు వెంటాడాయి. ఇంట్లోవున్న జనాభా అంతా కనుపించారుగానీ, ఆ భర్తనే శాల్తీ మటుకు కనబడలేదు. నాకు కొంచెం ఆశ్చర్యం కలిగినా, వాళ్ళ సంప్రదాయ మటువంటిదేమోనని పెద్దగా పట్టించుకోలేదు.

కొంతకాలం జరిగిపోయింది. వున్నట్లుండి గ్రామంలో విషజ్వరాలు ప్రారంభమయ్యాయి. నాకు ఊపిరాడనంత పని ఏర్పడింది. నాయుడిగారి పెద్ద గుమాస్తా, రామానుజంగారికి జ్వరం తగిలింది రమ్మంటూ వచ్చాడొక రోజున. నేను సవినయంగా నిరాకరించాను. హాస్పిటల్ నిండా జనం— వాళ్ళను వదిలేసి, అంత దూరం వెళ్ళి వచ్చేసరికి చాలా ఆలస్యమయిపోతుంది.



ఛాయాసుందరి

చిత్రం : యస్. హెచ్. కృష్ణ. మద్రాసు

# ఊహాతీతం

అరగంటయ్యాక హాస్పిటల్ ఆవరణంతా వున్నట్లుండి నిశ్శబ్దమైపోయింది. ఏమిటా అని తల ఎత్తేసరికి రమాదేవి నమస్కారం పెడుతూ నిలుచుని వుంది. ప్రక్కన నిండా ఖరీదైన శాలువాలో రామానుజం బల్ల మీద కూర్చొని వున్నాడు. గబగబా ఆయన్ను పరీక్షచేసి ఇంజక్షను, మందు ఇచ్చి పంపేశాను. తరువాత కూడా రెండు మూడు రోజులు భర్తను తీసుకొని రమాదేవే స్వయంగా వచ్చింది. ఆయన ఆరోగ్యం బాగుపడింది. కానీ విశేషమేమిటంటే ఇన్నాళ్ళూ రామానుజం పెదవి విప్పి ఒక్కమాటన్నా మాట్లాడలేదు. పసిపిల్లాడిలా రమాదేవి చెప్పినట్లు వినేవాడు. నాకు ఒకవైపు నవ్వు, జాలి కలిగేయి. (ఒక్క ముక్కలో చెప్పాలంటే "బాటసారి" లో నాగేశ్వరరావు అనుకోండి అన్నారు నవ్వుతూ చెప్పడం ఆపి.)

ఇంతలో వంటమనిషి కాఫీలు తెచ్చి పెట్టాడు. అందరూ తీరిగ్గా ఊపిరి పీల్చుకుంటూ కాఫీ తీసుకున్నారు.

పద్మావతి వెనక్కు చేరగిలబడి మళ్ళీ మొదలుపెట్టారు. "కొన్నాళ్ళు ఎలాంటి విశేషాల్లేకుండా గడిచిపోయాయి. ఆ రోజు నాకు బాగా జ్ఞాపకం, ముసురుగా వుంది. అడపాదడపా సన్నజల్లు పడుతూ వుంది. సాయం సమయం. హాస్పిటల్ ప్రశాంతంగా వుంది. పేషంట్లూ ఎవరూ లేరు. సాధారణంగా సాయంత్రం పేషెంట్లు ఎప్పుడూ తక్కువే. అందులో వాన. ఇంట్లోవుంటే బొత్తిగా తోచదని హాస్పిటల్‌కు వచ్చి కూర్చున్నా. హార్డీ నవలేదో తిరగేస్తున్నా. అంతలో ఎవరో ఒక స్త్రీ తలనిండా ముసుగు వేసుకొని ముఖం దించుకొని నెమ్మదిగా బల్లదగ్గరకు వచ్చి నిలుచుంది. నేను తాపీగా పుస్తకం బల్లమీదపెట్టి అవుట్ పేషెంట్ స్లిప్ తీసుకుంటూ "ఏమ్మా, ఏమిటి కష్టం?" అన్నాను. ఏం చెప్తుందోనని తల ఎత్తి చూడబోయాను. ఆమె రమాదేవి! నేను ఆశ్చర్యపోయాను. రమాదేవి ఏమిటి? ఇలా రావడమేమిటి? ఈ వానలో కనీసం గొడుగన్నా లేకుండా ఎలా వచ్చింది? వంటినిండా నగలతో పదిమంది బోయీలుమోసే పల్లకీలో వచ్చే ఆవిడ ఇలా వచ్చిందేం? దీనంగా, మాసిన పాత వాయిల్ చీరతోవుంది. ఎందుకని. ఇన్ని సందేహాల్తో ఉక్కిరిబిక్కిరి లాడుతూ తడబడుతూ "రండి. ఇలా కూర్చోండి" అన్నాను. నెమ్మదిగా స్టూలు లాక్కొని కూర్చుంది.

"ఏమిటిలా వచ్చారు? ఇంత వానలో?" అన్నాను.

క్షణం నా కళ్ళల్లోకి చూసి, "ఈ సమయం కొరకు ఎన్నాళ్ళుగానో ఎదురు చూస్తున్నాను, మీతో ఒంటరిగా మాట్లాడాలని వున్నది. నా రాక ఎవ్వరికీ తెలియకూడదు. అందుకనే ఇలా నడచివచ్చాను. మా ఇంట్లో ఎవ్వరికీ తెలియదు. మీరు మూడో మనిషికి తెలియనివ్వనని మాట ఇవ్వండి" అంది ఒట్టువేయమని చెయ్యి చాపుతూ.

ప్రమాణాలు, ఒట్టూ వెయ్యడం అలవాటులేని నాకు క్షణం ఆశ్చర్యమేసింది ఆవిడ చెప్తున్న విషయానికీ, ఒట్టువేయమని అడగడానికీ.

"ఫరవాలేదు. చెప్పండి" అన్నాను.

"వెయ్యరూ?" అంది చెయ్యి అలాగే చాచివుంచి. కేవలం నేను వెయ్యబోయే ఒట్టుమీదే ప్రాణం నిలిపివున్నట్లు చూస్తూ వుంది. కంటిచూపుకు అంతటి శక్తి, మాటలకు అంతటి ఆర్ద్రితా వుంటుందని నాకు మొదటిసారిగా తెలిసింది. అనాటమీ, ఫిజియాలజీలతో బుర్రవేడెక్కిపోయిన మనకు ఇల్లాంటివి ఎప్పుడోగాని స్ఫురణకు రావు. ఆ—ఇక కాదనే శక్తిలేక ఒట్టువేశాను.

తల వంచుకుని నెమ్మదిగా చెప్ప సాగింది.

"మా నాన్నగారికి నేను ఒక్కదాన్నే పుట్టాను. నేను పుట్టాక కొన్ని నెలల్లోనే మా అమ్మగారు స్వర్గస్థులయ్యారు. నాన్నగారు నన్ను చాలా గారాబంగా పెంచారు. నాకు పెళ్ళీడు వచ్చాక ఇల్లరికపుటల్లుడు కొరకు చాలా వెతికారు. నాన్నగారికి నన్ను అత్తవారింటికి పంపడం ఇష్టంలేదు. చివరకు రామానుజంగారి సంబంధం కుదిర్చారు. రామానుజంగారు బాగా చదువుకున్నవారు. వారికి పుస్తకాలే ప్రపంచం. ఇహలోకం మీద వారికి పెద్ద మోజులేదు. కానీ నన్ను ఒక్కమాట అనకుండా చూసుకుంటారు. మా బాబాయివాళ్ళు మా ఇంట్లోనే వుంటారు. బాబాయి తన వాటాకి వచ్చిన ఆస్థులన్నీ వ్యాపారంలో పెట్టి బాగా నష్టపోయాడు. మా నాన్నగారు బాబాయిని ఆదరించి తనదగ్గరే వుంచుకున్నారు. హఠాత్తుగా నాన్నగారు గుండె ఆగి చనిపోయారు." క్షణం ఆగి కళ్ళు తుడుచుకుంటూ చెప్పడం మొదలుపెట్టింది. 'నాన్నగారి మరణం నాకు తీరని లోటు. దానికితోడు నాకు సంతానం కూడా కలుగలేదు' అని చెప్తూ ఏడవసాగింది.

"విచారించకండి. మీరేమన్నా ముసలివారా అలా బాధపడ్తారు? వచ్చే ఏటికి మీకూ ఒక పాపాయి పుడ్తుంది" అని అన్నాను, ఏదో ఊరడింపు కలిగించాలని.

"నాకు నమ్మకంలేదు డాక్టరుగారూ! నాకా అదృష్టంలేదు. నాకు ఇప్పటికి మూడుసార్లు గర్భస్రావం జరిగింది. మూడవసారి మీరు చూశారుగదా? నేను ఇక ముందు గర్భవతినైనా నాకు అంతఅదృష్టం వుంటుం దంటారా? లేదండీ—లేదు. సరిగా మూడవ నెల రాగానే—అలా అయిపోతున్నది. డాక్టరుగారూ, నాకు ఎవరో విష ప్రయోగం చేస్తున్నారు. నాకు పిల్లలుకలగకుండా ఎవరో మందు పెడుతున్నారు. నాకు తెలుసు. నాకు పిల్లలు కలగడం ఎవరికీ ఇష్టంలేదు" అని బోరున ఏడ్వసాగింది.

ఆవిడ చాదస్తానికి కొద్దిగా చిరాకు, జాలి పుట్టుకొచ్చాయి. ఈవిడమీద కోపముంటే ఈవిడ్నే చంపవచ్చుగా పని గట్టుకొని ఈవిడ కడుపులోని పిల్లల్ని చంపాల్సిన అవసరం ఎవరికుంటుంది? ఆస్తిపాస్తుల గొడవలేమన్నా వున్నాయేమో అందుకే ఈవిడిలా కంగారుపడుతుంది. అని అనుకొని, పైకి, "మీరు బలమైన ఆహారం, విశ్రాంతి తీసుకోండి. పిచ్చిపిచ్చి ఊహలు పెట్టుకోకండి. నేను కొన్ని మందులిస్తాను, అవి పుచ్చుకోండి. అయినా, మిమ్మల్నిలా కష్టపెట్టాల్సిన అవసరం ఎవరికి" అన్నాను.

"డాక్టరు గారూ! నేను ఇంత కన్నా ఎక్కువ చెప్పలేను. నన్ను నిర్బంధించకండి. అవసరమైనప్పుడు నేనే చెప్తాను. నా బాధ్యత అంతా మీరు స్వీకరిస్తారా? నన్ను మాతృమూర్తిగా నిలబెడతారా?" అని మెరుస్తున్న కళ్ళతో ఆత్రంగా అడిగింది.

ఆమె కళ్ళల్లో కదులుతున్న మాతృ వాంఛ, మమతా నన్ను విచలితం చేసింది. "తప్పకుండా" అని ఆవిడ చెయ్యితీసుకొని మెల్లగా నిమురుతూ అన్నాను.

"కానీ అమ్మా, మీ రాక విషయం మరవకండి. మీరు నాకు ఆప్తులనీ, నాకు వైద్యం చేస్తున్నారనీ ఎవ్వరికీ తెలియనివ్వకండి. మీకు కూడా ఏదైనా ఆపద రావచ్చు. అవసరమైస్తే నేనే ఎలాగో వీలు చూసుకుని వస్తాను. మీరు మాత్రం రావద్దు" అని అన్నది.

మందులు తీసుకొని వెళ్ళిపోయింది.

ఆ తరువాత ఆవిడ రానూ లేదు. నేను వెళ్ళనూ లేదు. ఆ నాటి ఆవిడ ప్రవర్తన అర్థరహితం అనుకున్నా. ఎదురు చూస్తున్నట్లుగానే ప్రసవ వేదన పడుతున్నట్లు నాకు కబురు వచ్చింది

నన్ను చూడగానే రమాదేవి చాలా సంతోషపడిపోయింది. లేబర్ పేన్స్ బాగానే వస్తున్నాయి. వాళ్ళ ఇంటి మంత్రసానినిగాని, పరిచారికలనుగాని దగ్గరకు రానీయలేదు. నేను వచ్చేవరకు అలా నడుస్తూనే వుంది. కనీసం పడుకోనన్నాలేదు.

"డాక్టరుగారూ నన్ను, నా పాపను ఒక్కక్షణం ఏమారి వుండకండి. ఎవ్వర్నీ

రానివ్వకండి. మీకు ముందుగానే చెప్తున్నాను. మళ్ళీచెప్పే అవకాశం వుంటుందో లేదో? ఇన్నాళ్ళ నా శ్రమ బూడిదలోపోసిన పన్నీరవుతుంది. నేను బ్రతికితే నా చర్మంతో మీకు చెప్పులు కుట్టిస్తాను" అంది ఆయాసపడుతూ.


నాకు ఆమె భయంచూసి ఆశ్చర్యం వేసింది. అయినా ఎందుకన్నా మంచిదని నా జాగ్రత్తలోనే నుండాలని నిర్ణయించుకున్నాను. హాస్పిటల్ ఆయానుమాత్రం దగ్గరుంచుకొని మిగిలినవారి నందరినీ బయటకు పంపేసి పురిటిగది తలుపులు వేసేశాను.

కొద్ది సేపట్లో రామాదేవికి సుఖప్రసవం అయింది, మగపిల్లాడు. ఆరోగ్యంగా వున్నాడు. ఆనాడు రమాదేవి కళ్ళల్లో చూసిన తృప్తి, కాంతి, శాంతి, మెరుపు ఇంతవరకు మాతృత్వం పొందిన ఏ స్త్రీ కళ్ళల్లోను చూడలేదు.

"అమ్మా, నన్ను వదిలి వెళ్ళిపోరుగా" అంటూ గట్టిగా నా చెయ్యి పట్టుకొని అలసిపోయి నిద్రపోయిందామె.

"నేను చెయ్యి విడిపించుకొని అలానే చూస్తూ కూర్చున్నా. ఆ ఇంటి వాతావరణం చూస్తుంటే నాకు రమాదేవి నిర్హేతుకంగా భయపడలేదేమో ననిపించింది, ఫలానా కారణమని చెప్పలేను. అంతే కాకుండా నేను ఇంతవరకు ఎప్పుడూ అలా నా మామూలుపద్ధతికి భిన్నంగా ఏ పేషెంటుకు ఎటెండ్ అవలేదు. అలా అర్థం లేకుండా సేవచేయాలన్నా నా కిష్టం వుండదు. మన సర్వీస్ ఎంతవరకు అవసరమో అంతవరకే చెయ్యాలి. కానీ రమాదేవిని చూస్తుంటే నా పద్ధతులన్నీ ఎగిరిపోయేవి. ఆవిడ దీనమైన ముఖం నన్ను కరిగించేది. ఒకరకంగా నేను బలహీనురాల్నయ్యేదాన్నేమో ఆవిడ ముందు? ఏమో చెప్పలేను. ఏ శక్తి అలా ఆడించేదో?!"

రెండు మూడు గంటల తరువాత రమాదేవి లేచింది. మనిషి కులాసాగా వుంది. బిడ్డను హృదయానికి హత్తుకుంటూ, "అమ్మా, ఇది మీరు పెట్టిన భిక్ష. మీరు ధైర్యం కలిగించి నా వెనుక వుంటానని మాట ఇవ్వకపోయినట్లైతే నా బాబు నాకు దక్కేవాడు కాదు. డాక్టరుగారూ, ఆ రోజు మీ దగ్గరకువచ్చిన తరువాతనుంచి ఇప్పటివరకు నేను ఈ ఇంట్లో వండినవి ఏమీ తినలేదు. స్వయంగా కాచుకున్న పాలు త్రాగి, పండ్లుతిని ఈ ఆరునెలలూ గడిపాను.ఎవరు ఏ మందు ఎందులో కలిపి పెడ్తారోనని భయం. ఏ ధైర్యంతో ఇలా వుండగలిగానను కున్నారు? పురిటి సమయానికి మీరు వుంటారని, నన్ను చూసుకుంటారనీ, తొమ్మిది నెలలు కాపాడడం నా వంతనీ




తరువాత భూమ్మీద పడేసి కాపాడే భారం మీదనీ అనుకున్నాను. కానీ నాకు భయంగా వుంది. తరువాతన్నా వీడ్ని బ్రతికించుకోగలనో లేదో?— ఇక భగవంతుని దయ— మీరు వెళ్ళిరండి తల్లీ" అని అంది నమస్కారం పెడుతూ.

ఆవిడ పట్టుదలకి ఒకవైపు ఆశ్చర్యం ఒకవైపు జాలి, ప్రేమ కలిగాయి. ఆవిడకు ధైర్యం చెప్పి, అదో రకమైన తృప్తితో, శాంతితో ఇంటికి వచ్చేశాను.

తరువాత ఒక నెల గడిచిందనుకుంటాను. నేను రమాదేవినిగాని, పసివాడ్నిగాని మళ్ళీ చూడలేదు. నాన్నగారు ఒకసారి వచ్చి వెళ్ళమని బలవంతం చేస్తూ ఉత్తరాలమీద ఉత్తరాలు వ్రాస్తున్నారు. నాకూ చూడాలని అనిపించింది. సరే ప్రయాణం రోజు నిర్ణయించుకొని, శెలవు తీసుకున్నాను. సాయంత్రం బండి కాస్త పెందరాడే ఇల్లు చేరుకున్నాను.

మా వంటావిడ "అమ్మా, రమాదేవి గారి పిల్లాడు పోయాడటమ్మా, చిన్న బిడ్డ చేష్ట వచ్చిందట పాపం" అంది.

నాకు మతిపోయింది. "అయ్యో, ఇదేమిటి? ఎలా, ఏం చేయగలను? రమాదేవి ఏమైపోయి వుంటుంది?ఎలా భరించగలదు? ఇప్పుడెలా?" ఇలా మధనపడుతూ దాదాపు పిచ్చిదాన్నయిపోయాను. రమాదేవిని ఎలా ఓదార్చగలను? లాభంలేదు. ఆవిడ్ని నేను చూడలేను, నావల్లకాదు. ఓడిపోయిన రమాదేవి నన్ను భరించలేదు? నేను ఆవిడ్ని ఆ స్థితిలో— అబ్బ—నాతరం కాదు. నా బాధ నేను ఈనాడు మాటల్లోమీకు చెప్పలేను, వర్ణించలేను. సాధారణంగా కంటతడిపెట్టని నేను ఆ రోజున విగ్రహించుకోలేకపోయాను. ఆ కన్నీళ్ళు రమాదేవి మీద జాలివల్ల కారాయో, నేను నమ్మని ఆ భగవంతుని విలాసం మీద కోపంతో కారాయో, మానవుల చేతకానితనానికీ, మూర్ఖత్వానికి కారాయో నేను మటుకు చెప్పలేను. కానీ రమాదేవిని మటుకు చూడలేదు, సాయంత్రం వికలమయి, భారమైన మనస్సుతో స్టేషనుకు చేరుకున్నాను.

బండి కదలబోతున్నదో, కదిలిందో గమనించలేదు. ఎవరో ఒక వ్యక్తి పెద్ద పేము బుట్ట నా సామాను దగ్గరగాపెట్టి రమాదేవిగారు ఇవ్వమన్నారు. అని నా సమాధానం కొరకు ఎదురు చూడకుండా దిగిపోయాడు. బండివేగం అందుకుంది. నాకు ఆ మనిషి ముఖం చూసే అవకాశం కూడా దొరకలేదు. పాపం రమాదేవికి నామీద ఎంత అభిమానం? నేను ఊరికి వెళ్తున్నానని తెలిసి పండ్లు పంపమని ఎవరితోనో చెప్పి వుంటుంది. వాళ్లు తు. చ. తప్పకుండా ఆచరించారు. అంతకు ముందు ఒక సారి ఇలానే పంపింది. ఇప్పుడెంత దుఃఖంలో వుందో? నేను కనీసం సానుభూతన్నా చూపకుండా ఇలా పిరికిదానిలా పారిపోయి వచ్చేస్తున్నా అని అనుకుంటూ వెనక్కి పోతున్న ప్రకృతిని చూస్తూ కూర్చున్నా. కాస్త తోడుగా వుంటారంటే కంపార్టుమెంటులో ఎవ్వరూ లేరు—బిక్కు బిక్కు మంటూ కూర్చున్నా.

కాస్త కునుకు పట్టిందేమో— చటుక్కున ఉలిక్కిపడిలేచా ఏమిటా అని.

## ఊహాతీతం

పసిపిల్ల గుక్కపెట్టి ఏడుస్తున్న చప్పుడు వినిపిస్తోంది. ఎక్కడా? ఎవరన్నా ఎక్కారా? ఏమిటి? అని చుట్టూ చూశాను. అది ఫస్టు క్లాసు కంపార్టుమెంటు. నేను వేసిన తలుపు గడియ అలాగే వుంది. నాకు మతిపోయింది, ఏడుపు మరీ ఎక్కువగా వుంది. భయమంటే ఎరుగని నాకు వెన్ను జలదరించింది. గుండె చిక్కపట్టుకొని మళ్ళీ మళ్ళీ విన్నాను. సందేహం లేదు. ఆ చప్పుడు రమాదేవి పంపిన బుట్టలో నుంచి వస్తూంది. చటుక్కున మూత తీసి చూశాను. నిజమే—అందులో రమాదేవి కొడుకు ఏడుస్తున్నాడు; అప్పటి నా భావాల్ని నేను చెప్పలేను. భయం సంతోషం. ఆశ్చర్యం, కోపం, నిస్సహాయతా, అన్నీ కలగా పులగంగా నన్ను ఒక్క ఊపు ఊపాయి. అంతటి భావోద్వేగం సంఘర్షణ మళ్ళీ ఇంతవరకు అనుభవంకాలేదు. బుట్టలోనే పాలసీసా వుంది. పిల్లాడ్ని ఒళ్ళోకి తీసుకొని పాలు పట్టాను. వాడుత్రాగి హాయిగా నిద్రపోయాడు. ఈ లోగా నేనూ స్తిమితపడ్డాను.

జరిగింది కలా నిజమా? అని మళ్ళీ మళ్ళీ చూశాను. బుట్టలో ఒక కవరు నన్ను ఉద్దేశించి వ్రాయబడివుంది. ఆత్రంగా తొందరగా చించి చదవడం మొదలు పెట్టాను. అందులో ఇలా వుంది:

అమ్మా,

మీ కింతటి మానసి కాందోళన కలిగించిన ఈ దీనురాల్ని క్షమించండి. నా స్వార్థానికి మిమ్మల్ని ఉపయోగించు కుంటున్నాను మన్నించండి. వచ్చే జన్మంటూ వుంటే మళ్ళీపుట్టి మీ ఋణం తీర్చుకుంటాను. ఈ జన్మకు మీరుచేసిన ఉపకారానికి నేను ఎంతచేసినా, మరో జన్మకు సరిపడా నేను ఋణపడే వుంటాను. తల్లీ, చనిపోయిన మా అమ్మే మీ రూపంలోవచ్చి నన్ను ఆదుకుంది. నేను ఎంతటి బలవత్తర కారణాలవల్ల ఇలా చేయవలసి వచ్చిందో చెప్తాను. బ్రతికివున్న బిడ్డను చనిపోయాడని నాటక మాడవలసిన దుర్గతి ఏ స్త్రీకి పట్టివుండదు. ప్రాణప్రదమైన ఒక్కగా నొక్క బిడ్డను అంతులేని ఐశ్వర్యంవుండీ, తల్లితండ్రులిరువురూ వుండీ ఇతరుల దయాక్షిణ్యాలకు వదలివేసే దౌర్భాగ్యం ఏ తల్లికి పట్టివుంటుంది? అల్లారుముద్దుగా పెరగాల్సిన నా బిడ్డ అనాధగా పెంచబడటానికి కారణం? చెప్తాను తల్లీ_ నా కథ వినండి. నేను చేసిన పని సబబో కాదో చెప్పండి. ఇంతకన్నా మరోమార్గం నాకు భగవంతుడు చూపలేదు.

మా నాన్నగారు చనిపోకముందే వీలునామా వ్రాశారు. అందులో యావదాస్తీ నా పేర పెట్టారు. అంతేకాకుండా కొన్ని నిబంధనలు పెట్టారు. ఎందుకలా చేశారో నాకు తెలియదు. నాకు యాభై సంవత్సరాలు వచ్చేలోగా సంతానం కలుగకపోతే నా ఆస్తిలో సగంభాగం మా బాబాయికి పోతుంది. సంతానం కలిగితే నా ఆస్తి అంతా నా పిల్లలకు చెందుతుంది. నేను ఈలోగా మరణిస్తే ఆస్తి అంతా దేవాలయాలకు, అనాధ శరణాలయాలకు చెందుతుంది. ఇవి ముఖ్యమైన అంశాలు. ఇవే నా పాలిట మృత్యుదేవతలయాయి. ఇవే నా పాలిట శాపాలయ్యాయి. ఈ విషయాలు ముందే తెలిస్తే కట్టుగుడ్డలతో మా నాన్నగారికి నమస్కారంచేసి సంతోషంగా బయటపడే దాన్ని. ఈ ఆస్తే నన్నీదుస్థితికి తెచ్చింది. నా బిడ్డనూ, నన్నూ దూరంచేసింది. నాకీ రంపపుకోత తెచ్చిపెట్టింది.

పాపపుణ్యాల నిర్ణయం భగవంతుని న్యాయస్థానంలో. నాకు గర్భవిచ్ఛిత్తికి మందులు పెట్టారు. ఎవరు అని అడక్కండి నేను చెప్పలేను. నా అనుమానం నాకు వున్నది. ఇంట్లోవున్న వారందరూ మీకు తెలుసుగదా? మీ ఊహకు అందకపోదు. ఆ విషయం వదిలేద్దాం తరువాత మీ దయ వల్ల ఈ ప్రసాదాన్ని పొందగలిగాను. కానీ వీడే నిమిషాన దూరమయిపోతాడో నని అహర్నిశలూ కాపాడాల్సి వచ్చింది. ఈ నెల రోజులు కళ్ళల్లో వత్తులు వేసుకొని కాపలాకాశాను. ఇక లాభం లేదు. డాక్టరుగారూ, ఇక నా వల్లకాదు. నా బాబుని రక్షించుకునే శక్తి నాకిక లేదు. రోజుకోసారీ, గడియకోసారీ ఎదురయ్యే మృత్యువు నుంచి ఎన్నిరోజులు కాపాడగలను? నేను నిర్హేతుకంగా అనడంలేదు. నా బిడ్డను పెంచుకోడం నాకు బరువా? వాడికోసం ఎన్ని కష్టాలు పడ్డానో మీకు తెలియదా? నాకు దూరమయినా, నా తండ్రి బ్రతికి వుంటే చాలు. అందుకే వాడ్ని మీ కప్పగిస్తున్నాను. వాడు చనిపోయాడంటే ఎవ్వరికీ ఏ అనుమానం ఉండదని ఇలా నాటకమాడాను. వాడ్ని ఎలా పెంచి పెద్ద చేస్తారో?! తలకు మించిన భారం మీ మీద పెడ్తున్నాను. దయగా చూసిన నేరానికి మీకీ శిక్ష విధిస్తున్నా. నాకు మరో దారి కనబడలేదు తల్లీ— ఏం చేయను?— నాకెవ్వరూ లేరు— భర్త వున్నా లేనివారిక్రిందే లెఖ్ఖ. నన్నేం చేయమంటారు ఇంత కన్నా?! ఇలా ఎంతని వ్రాయను? ఎంతవ్రాస్తే నా మనోభారంలో సహస్రమైనా తగ్గుతుంది? అమ్మా, అమ్మా, అమ్మా, నామీద చూపిన ప్రేమ వాడిమీద చూపండి. వాడ్ని కాపాడండి.



క్షీణించిన ప్రగతి

ఫొటో : జి. ఇస్మాయిల్. సత్తెనపల్లి

మరోసంగతి జ్ఞాపకం వుంచుకోండి. నా చిరంజీవికి కుడి తొడలో పెద్ద పుట్టుమచ్చ వుంది. జీవితంలో మళ్ళీ వాడ్ని చూసే అదృష్టమేవుంటే అదే నాకు గుర్తు. క్షమించు తల్లీ—

నిర్భాగ్యురాలు–రమాదేవి.

ఇంతేనర్రా కథ అలా గుడ్లప్పగించి చూస్తారేం? అయిపోయింది. రమాదేవి గురించి మీ ఇష్టం వచ్చినట్లు మీరు ఊహించుకోండి, అభిప్రాయాలేర్పరచుకోండి. నాకేం అభ్యంతరంలేదు. నేను మటుకు ఆవిణ్ణి క్షమించేశాను." అన్నారు పద్మావతి.

శ్రోతలు ఇంకా చూస్తూనే వున్నారు ఆవిడవేపు ఏంచెప్తారో నని. ఇక చెప్పే సూచనలేంవీ కనబడలేదు. చివరకు రమ ఆగలేక, "కథ అసంపూర్ణంగా వదిలేసి మమ్మల్ని బాధ పెట్టకండి. ఆ పిల్లాణ్ణి ఏంచేశారు? రమాదేవిగార్ని మీరు మళ్ళీ చూశారా? ఆవిడ శత్రువులు ఏమయ్యారు?" అని అంది.

"మీరు ఊహించి రేపు చెప్పండి. నేను తరువాత చెప్తాను" అన్నారు సోఫాలోంచి లేస్తూ.

డాక్టరు పద్మావతి పెద్దకొడుకుగా చెలామణి అవుతున్న ప్రసాద్ ఆ పిల్లాడేననీ, ఆ సంఘటన తరువాత కొద్దిరోజులకే విపరీతంగా అనుకోకుండా వచ్చిపడిన వరదల వల్ల ఆ చుట్టుప్రక్కల వంద గ్రామాలు సర్వనాశనమై పోయాయని వాళ్ళల్లో ఒకరన్నా ఊహించివుండరు.

★